# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...








సంపుటి : 2 సంచిక : 301 గురువారం 20 జూన్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# అధికారుల బదిలీపై కొలిక్కిరాని కసరత్తు

- తెలంగాణలో ప్రక్షాళన వేగవంతం..
- ఐఏఎస్ అధికారుల బదిలీపై కొనసాగుతున్న సస్పెన్స్!
- శనివారం 20 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించిన రాష్ట్ర ప్రభుత్వం
- 10 మంది ఐఏఎస్ అధికారులకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వని వైనం
- కొంతమంది సీనియర్ అధికారులను కూడా బదిలీ చేయాలని ప్రభుత్వ యోచన
- బీఆర్ఎస్ హయాంలో నియమితులై, ఇప్పటికీ కంటిన్యూ అవుతున్న అధికారులు, ఒకే పోస్టులో దీర్ఘకాలికంగా ఉన్నవారిని బదిలీ చేసే అవకాశాలు
- రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా కూడా ఈ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.




హైదరాబాద్

తెలంగాణలో మరికొందరు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసే అంశంపై సర్కారు కసరత్తు చేస్తోంది. ఈసారి కొంత మంది సీనియర్ ఐఏఎస్‌లకు కూడా స్థానచలనం ఉండొచ్చని తెలుస్తోంది. శనివారం 20 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించిన రాష్ట్ర ప్రభుత్వం..10 మంది ఐఏఎస్ అధికారులకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రస్తుతం వీరంతా వెయిటింగ్‌లో ఉన్నారు. వీపీ గౌతమ్, పి.ఉదయ్ కుమార్, పమేలా సత్పతి, భవేశ్ మిశ్రా, యాస్మిన్ బాషా, జి.రవి, హరిచందన దాసరి, ఎస్.వెంకటరావు, త్రిపాఠి, ఆల ప్రియాంకలకు పోస్టింగులు ఇవ్వాల్సి ఉంది. వీరితో పాటు కొంతమంది సీనియర్ అధికారులను కూడా బదిలీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. బీఆర్ఎస్ హయాంలో నియమితులై, ఇప్పటికీ కంటిన్యూ అవుతున్న అధికారులు, ఒకే పోస్టులో దీర్ఘకాలికంగా ఉన్నవారిని బదిలీ చేసే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలో అత్యంత కీలకమైన వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖలకు ముఖ్య కార్యదర్శి లేరు. ఇప్పటివరకు ఈ రెండు శాఖలకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సునీల్ శర్మ మే 31న పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి ఈ పోస్టులో ప్రభుత్వం ఎవరిని నియమించలేదు. కనీసం అదనపు బాధ్యతలను కూడా ఎవరికి అప్పగించలేదు. ఈ బాధ్యతల కోసం రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా కూడా ఈ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.ప్రస్తుతం ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో రాబడి ఎక్కువగా ఉండే ఈ రెండు శాఖలకు - మిగతా3లో



## ఎమ్మార్హెచ్చార్డీలోనే సీఎం క్యాంప్ ఆఫీసు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోసం కొత్త క్యాంపు కార్యాలయాన్ని సిద్ధం చేస్తోన్న ప్రభుత్వం
- తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 6 నెలలవుతున్నా..
- నేటి వరకు ఆయనకంటూ ప్రత్యేకంగా క్యాంపు కార్యాలయం లేదు.
- తొలుత నూతన కార్యాలయం నిర్మిస్తే ఎలా ఉంటుందనే కోణంలో అధికారులు అలోచించగా, దానికి ముఖ్యమంత్రి నో చెప్పినట్లు సమాచారం
- తన కార్యాలయం కోసం అనవసరంగా ప్రజాధనం వెచ్చించటానికి బదులు.. ఉన్న భవనాల్లోనే ఏదో ఒకదానిని వాడుకుంటే సరిపోతుందని ఆయన సూచించిన సీఎం



## నాణ్యమైన డాక్టర్లను అందించడమే లక్ష్యం

- హెల్త్ ఎడ్యుకేషన్‌కు తెలంగాణను బెస్ట్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతాం
- ప్రభుత్వ, ప్రైవేటు వైద్య విద్య కళాశాలలతోపాటు డెంటల్ కాలేజీల్లోనూ మెరుగైన విద్య అందించేందుకు చర్యలు
- రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్య విద్య అందించేందుకు ప్రాధాన్యం ఇచ్చింది
- రాష్ట్రంలో వైద్య ఆరోగ్యానికి సంబంధించి మూడు రకాల టాస్క్‌ఫోర్సులు ఏర్పాటు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్

తెలంగాణలోని ప్రైవేట్ వైద్య విద్య కళాశాలల యాజమాన్యం, డీన్‌లు, ప్రిన్సిపాల్స్‌తో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యకు ఇస్తున్న ప్రాధాన్యత గురించి మంత్రి వివరించారు. - మిగతా3లో

# ఇక ప్రజల్లోకి గులాబీ బాస్

- బీఆర్ఎస్‌ను ట్రాక్‌లో పెట్టడంపై కేసీఆర్ ఫోకస్
- జిల్లా కమిటీలు, అనుబంధ సంఘాల బలోపేతం..
- జిల్లా కమిటీల నియామకం కోసం ఒక అడహాక్ కమిటీ వేయాలని భావిస్తున్నట్లు సమాచారం
- అలాగే పొలిట్ బ్యూరో సహా రాష్ట్ర కమిటీని పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని భావిస్తున్న కేసీఆర్
- మండలాల వారిగా.. గ్రామాల వారిగా జెండా పండుగ నిర్వహించి పని చేయనున్న కొత్త కమిటీలు
- రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేపట్టాలని భావిస్తున్నారని టాక్



హైదరాబాద్

బీఆర్ఎస్‌ను ట్రాక్‌లో పెట్టడంపై ఆ పార్టీ అధినేత కేసీఆర్ దృష్టిసారించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్.. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని ఎదుర్కొంది. వరుస ఓటములతో ఢీలాపడిన బీఆర్ఎస్‌ను ట్రాక్‌లో పెట్టడంపై ఆ పార్టీ అధినేత కేసీఆర్ దృష్టిసారించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్.. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని ఎదుర్కొంది. తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఒక్క స్థానంలో కూడా గెలవలేక ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ చతికిలపడింది. ఈ ఓటమి తర్వాత పార్టీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయబోతున్నారు - మిగతా3లో

## మక్కాలో మృతి చెందిన వారిలో 68 మంది భారతీయులు!



- భారత్ నుంచి వచ్చిన వారూ మృతి చెందినట్లు గుర్తించామన్న సౌదీ దౌత్యవేత్త
- సహజ మరణం... వృద్ధాప్యం కారణంగా మృతి చెందినవారు కూడా ఉన్నట్లు వెల్లడి
- కొంతమంది వాతావరణ పరిస్థితుల కారణంగా మృత్యువాత పడ్డారని వెల్లడి



## పెరుగుతున్న మరణాలు..

- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి కీలక ఆదేశాలు
- ఉత్తర భారతదేశంలో రోజురోజుకు పెరుగుతున్నా ఉష్ణోగ్రతలు
- అన్ని కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక హిట్‌వేవ్ విభాగాలను ఏర్పాటు చేయాలి
- 51 డిగ్రీల సెల్సియస్‌కు చేరినట్లుగా ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే వెల్లడి
- ఈ వేడిగాలుల బారిన పడుతున్న వారిలో అత్యధికులు దినసరి కూలీలే



## బ్యాంకర్లకు సామాజిక, మానవీయ కోణం ఉండాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో తెలంగాణ రూపురేఖలు మారిపోతున్నాయి
- వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధితో ఈ రాష్ట్రం అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడనుంది
- బలహీన వర్గాలకు విరివిగా రుణాలు ఇస్తేనే రాష్ట్రం సమగ్ర అభివృద్ధి చెందుతుంది
- నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలి

హైదరాబాద్


బ్యాంకర్లకు సామాజిక, మానవీయ కోణం ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం బ్యాంకర్ల వార్షిక రుణప్రణాళికను ఆవి ష్కరించి మాట్లాడారు. పెట్టుబడులకు స్వర్గధామం హైదరాబాద్ అన్నారు. బ్యాంకర్స్‌కు పాజిటివ్ దృక్పథం లేకపోతే ఏ రాష్ట్రం అభివృద్ధి చెందదని పేర్కొన్నారు. నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని సూచించారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో తెలంగాణ రూపురేఖలు మారిపోతున్నాయి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధితో ఈ రాష్ట్రం అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడనుందన్నారు. ఆయిల్ ఫామ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహాలు అందిస్తుందన్నారు. సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు ఎక్కువ రుణాలు ఇవ్వాలి. బలహీన వర్గాలకు విరివిగా రుణాలు ఇస్తేనే రాష్ట్రం సమగ్ర అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్తు ఉంది. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చిన విద్యుత్ సరఫరాకు ఇబ్బంది ఉండదని తెలిపారు.

# దంచికొడుతున్న ఎండలు..! మండుతున్న కూరగాయల ధరలు!



దేశ రాజధాని ఢిల్లీతో సహా పలు రాష్ట్రాల్లో వడగాలులు వీస్తున్నాయి. అదే సమయంలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. వాటి ప్రభావం వంటిల్లుపై ప్రత్యక్ష ప్రభావం చూపిస్తున్నది. ఉష్ణోగ్రతల పెరుగుదల కారణంగా పండ్లు, కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. గతవారం రోజుల్లో పలు కూరగాయల ధరలు డబుల్ అయ్యాయి. ఎండలకు పంటలు ఎండిపోతుండగా.. మార్కెట్‌కు తీసుకువచ్చిన కూరగాయలు సైతం పాడైపోతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. దీని ప్రభావంతో మార్కెట్‌లో ధరలు భారీగా పెరిగాయి. ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలోని అతిపెద్ద ఆజాద్‌పూర్ మార్కెట్‌లో కూరగాయల సరఫరా పడిపోయిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. హిమాచల్ చెందిన 25 కిలోల టమాటాను రూ.1000కి చేరింది. కర్ణాటకలో పొలాల నుంచి తీసుకువస్తున్న టమాటకు కిలోకు రూ.40 ధర పలుకుతున్నది. వారం కిందట క్యాప్సికం కిలో ధర రూ.50-రూ.60 వరకు ఉండగా.. ప్రస్తుతం కిలో ధర రూ.110 వరకు పలుకుతున్నది. గతంలో రూ.80 నుంచి రూ.100 పలికిన నిమ్మకాయలు ప్రస్తుతం కిలో రూ.160కి పెరిగాయి. బెల్లం కిలో రూ.150 నుంచి రూ.170కి చేరింది. ఇక యాపిల్, మామిడి, దానిమ్మ, బొప్పాయి, పుచ్చకాయ, సీజనల్ ఫ్రూట్, కొబ్బరిబోండాల ధరలు సైతం 25 నుంచి 30శాతం వరకు ధరలు పైకి చేరాయి. ఆకుకూరల ధరలు పెరగడంతో మార్కెట్‌లో బంగాళాదుంపలకు డిమాండ్ పెరిగింది. అయితే, సరఫరా మాత్రం అంతంతమాత్రంగానే ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. బంగాళాదుంపలు ప్రధానంగా యూపీ, బెంగాల్ నుంచి ఎక్కువగా సరఫరా అవుతుంది. శీతాకాలంలో ప్రతికూల వాతావరణంతో దిగుబడి తక్కువగా ఉన్నది. కోల్డ్ స్టోరేజీల నుంచి తీసుకువచ్చిన ఆలుగడ్డలు పాడైపోతున్నాయి. మండుతున్న ఎండలకు పొలాల్లో ఆకుకూరలు మండిపోతున్నాయి. సోరగాయలు, బెండకాయలు, టమాటా మొక్కలు మాడిపోతున్నాయని.. ఉదయం, సాయంత్రం వేళల్లో నీరు పెట్టినా మొక్కలు బతకడం లేదని రైతులు వాపోతున్నారు. ఎండలు, వర్షాల లేమితో కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో జూన్‌లో టోకు ద్రవ్యోల్బణం మూడు శాతానికి పెరగవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## మక్కాలో మృతి చెందిన వారిలో 68 మంది భారతీయులు!



హజ్ యాత్రకు వచ్చి ఈ సంవత్సరం 600 మందికి పైగా మృతి చెందారని, అందులో 68 మంది భారతీయులు ఉన్నారని సౌదీ అరేబియా దౌత్యవేత్త ఒకరు బుధవారం వెల్లడించారు. భారత్ నుంచి వచ్చిన వారిలో 68 మంది మృతి చెందినట్లు గుర్తించామన్నారు. ఇందులో కొందరు సహజంగా, మరికొందరు వృద్ధాప్యం కారణంగా మృతి చెందిన వారు ఉన్నట్లు వెల్లడించారు. ఇంకొంతమంది వాతావరణ పరిస్థితుల కారణంగా మృత్యువాత పడినట్లు చెప్పారు. ఈ ఏడాది హజ్ యాత్రలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో వేడిని తట్టుకోలేక 550 మందికి పైగా మృతి చెందినట్లు మంగళవారం అరబ్ ప్రతినిధులు తెలిపారు. మక్కాలో ఉష్ణోగ్రతలు దాదాపు 52 డిగ్రీలుగా నమోదైంది. మృతి చెందినవారిలో ఈజిప్ట్, సౌదీ అరేబియాకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. ఎండవేడిని తట్టుకోలేక మరో 2,000 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

## పెరుగుతున్న మరణాలు..



**న్యూఢిల్లీ :** ఉత్తర భారతదేశంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో వేడిగాలులు బలంగా వీస్తున్నాయి. ఆ క్రమంలో మరణిస్తున్న వారి సంఖ్య అంతకంతకు పెరుగుతుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నతాధికారులకు బుధవారం కీలక ఆదేశాలు జారీ చేశారు. అన్ని కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక హిట్‌వేవ్ విభాగాలను ఏర్పాటు చేయాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు. మరోవైపు దేశ రాజధాని న్యూఢిల్లీలో వాతావరణ పరిస్థితులు.. 51 డిగ్రీల సెల్సియస్‌కు చేరినట్లుగా ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే వెల్లడించింది. ఈ వేడి గాలుల వల్ల మంగళవారం 11 మంది రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో చేరారని ఆ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అజయ్ శుక్లా వెల్లడించారు. ఈ సీజన్‌లో ఇదే అత్యధికమని ఆయన స్పష్టం చేశారు. ఈ వేడిగాలు ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు 45 మంది ఆసుపత్రిలో జాయిన్ అయ్యారని వివరించారు. ఈ వేడిగాలుల బారిన పడుతున్న వారిలో అత్యధికులు దినసరి కూలీలేనని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు ఈ వేడిగాలుల తీవ్రతతో ఉత్తరాదిలోని వివిధ రాష్ట్రాల్లో అధిక సంఖ్యలో ప్రజలు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ఆ క్రమంలో మరణిస్తున్న వారి సంఖ్య కూడా భారీగా ఉంటుంది. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ ప్రభుత్వాసుపత్రుల్లో గత మూడు రోజుల్లో 40 మంది మరణించారు. వేడి గాలుల వల్లే ఈ మరణాలు సంభవించాయని వైద్యులు వెల్లడిస్తున్నారు. ఇక నోయిడాలో సైతం తొమ్మిది మంది ఈ వేడిగాలుల వల్ల మరణించారు.

# బస్సుపై ఉగ్రదాడి కేసులో కీలక పరిణామం



**జమ్ము కాశ్మీర్ :** రియాసీ ఉగ్రదాడి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ దాడికి పాల్పడిన తీవ్రవాదులకు ఆయుధాలు సమకూర్చిన వ్యక్తిని పోలీసులు బుధవారం రాజౌరీలో అరెస్ట్ చేశారు. అతడిని పోలీసులు విచారిస్తున్నారు. మరోవైపు ఈ కేసుకు సంబంధించి 50 మంది అనుమానితులను ఇటీవల పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే ఈ కేసులో కీలక నిందితులుగా భావిస్తున్న ముగ్గురు అనుమానితుల ఊహాచిత్రాలను ఇప్పటికే పోలీసులు విడుదల చేశారు. వీరి సమాచారం అందిస్తే.. రూ.20 లక్షల రివార్డు అందజేస్తామని ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. మరోవైపు ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ)కు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అప్పగించింది. ఈ ఏడాది మే 4వ తేదీన పూంచ్‌లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కాన్వాయి లక్ష్యంగా చేసుకొని దాడికి తెగబడిన ముగ్గురు పాకిస్థానీ తీవ్రవాదులకు ఈ ఉగ్రదాడిలో సంబంధం ఉందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆ క్రమంలో సదరు ముగ్గురు తీవ్రవాదుల ఊహచిత్రాలను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే రియాసీ ఉగ్రదాడికి తామే బాధ్యులమని నిషేధిత లష్కర్ ఈ తోయిబా సంస్థకు చెందిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించింది. ఆ తర్వాత ఆ ప్రకటనను ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉపసంహరించుకుంది. ఇక ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన జమ్ము కాశ్మీర్‌లో శాంతి భద్రతలు, వరుస ఉగ్రదాడులపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉగ్రవాదులను అణిచివేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులకు మంత్రి అమిత్ షా కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. జూన్ 9వ తేదీన జమ్ము కాశ్మీర్‌లోని శివ ఖోరి నుంచి కాట్రాలోని శ్రీ మాత వైష్ణోదేవి ఆలయానికి యాత్రికులతో వెళ్తున్న బస్సుపై రియాసీ జిల్లాలో ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. దీంతో డ్రైవర్ బస్సు వేగాన్ని పెంచాడు. దాంతో బస్సు లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మరణించగా, 41 మంది తీవ్రంగా గాయపడ్డారు. బస్సులో ప్రయాణిస్తున్న యాత్రికులు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీకి చెందిన వారు. ఇంకోవైపు న్యూఢిల్లీలో ప్రధానిగా మోదీతోపాటు ఆయన కేబినెట్ మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలోనే.. ఈ బస్సుపై ఉగ్రవాదులు దాడి చేయడం గమనార్హం.

## ఢిల్లీ నీటి సంక్షోభంపై ఆప్, బీజేపీ డైలాగ్ వార్



దేశ రాజధానిలో నెలకొన్న జల సంక్షోభం ఆప్, బీజేపీల మధ్య రాజకీయ రగడకు కేంద్ర బిందువైంది. ఇరు పార్టీలు నీటి సమస్యకు మీరంటే మీరే కారణమని డైలాగ్ వార్‌కు తెరలేపారు. తాజాగా బీజేపీ చవకబారు రాజకీయాలతోనే నీటి సమస్య తలెత్తిందని ఆప్ ఎంపీ సందీప్ పాఠక్ ఆరోపించారు. దీర్ఘకాలంగా హరియాణ నీటి అవసరాల కోసం పంజాబ్ నీటిని సరఫరా చేస్తోందని, ఢిల్లీ వాసుల నీటి అవసరాల కోసం హరియాణ నీటిని సరఫరా చేస్తోందని చెప్పారు. ఢిల్లీ ప్రస్తుతం 90-95 ఎంజీడీ నీటి కొరతను ఎదుర్కొంటోందని పాఠక్ వివరించారు. మా హక్కులను మేం అడగకూడదని భావిస్తే మానవతా దృక్పథంతో హరియాణ ముందుకు వచ్చి సాయం చేయాలని పాఠక్ కోరారు. ఇక అంతకుముందు ఢిల్లీలో నీటి ఎద్దడి విషయంలో ఆప్ లక్ష్యంగా ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ విమర్శలు గుప్పించారు. ఆప్ ఎమ్మెల్యేలు, మంత్రులు నీటిని అమ్ముకోవడంతోనే ఈ సమస్య తలెత్తిందని ఆరోపించారు.

## బడ్జెట్‌కు ముందు ఆర్థిక వేత్తలతో నిర్మలా సీతారామన్ సంప్రదింపులు



2004-25 ఆర్థిక సంవత్సరానికి సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ఢిల్లీలో ఆర్థిక వేత్తలతో సంప్రదింపులు జరిపారు. బడ్జెట్ కసరత్తులో భాగంగా ఆర్థిక వేత్తలతో జరిగిన భేటీకి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ సమావేశానికకి ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి, ఆర్థిక కార్యదర్శి, ఆర్థిక వ్యవహారాలు, రెవెన్యూ, ఆర్థిక సేవలు, కార్పొరేట్ వ్యవహారాల కార్యదర్శులు, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారులు కూడా హాజరయ్యారని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇక రానున్న బడ్జెట్‌లో ఎకానమీలో ఉత్తేజం పెంచేందుకు, మధ్యతరగతికి ఊరట ఇచ్చేలా పన్ను శ్లాబ్‌లను సవరించవచ్చని భావిస్తున్నారు. వ్యవసాయం, నీటి పారుదల, మౌలిక వసతుల రంగాలకు సంబంధించి పలు ప్రోత్సాహక చర్యలు చేపట్టవచ్చని చెబుతున్నారు. కాగా, వచ్చే నెలలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

# నలంద.. భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మిళితం



**పాట్నా :** నలంద అంటే పేరు కాదని.. భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మిళితమని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. బుధవారం రాజ్‌గిర్‌లో నలంద యూనివర్సిటీ కొత్త క్యాంపస్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. అగ్నికీలలు పుస్తకాలను కాల్చవచ్చు.. కానీ జ్ఞానాన్ని మాత్రం కాదని ఆయన పేర్కొన్నారు. ఇదే సత్యాన్ని నలంద పునరుద్ధాటిస్తుందన్నారు. ప్రధానిగా మూడోసారి ప్రమాణం చేసిన 10 రోజుల్లోనే ఇలా నలంద యూనివర్సిటీకి వచ్చి క్యాంపస్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ యూనివర్సిటీ భారతదేశ చరిత్ర మాత్రమే కాదని.. ఆసియాలో ఒక భాగమన్నారు. ఈ యూనివర్సిటీ పునర్నిర్మాణంలో ఇతర దేశాలు సైతం పాలుపంచుకున్నాయని ప్రధాని మోదీ వివరించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు.. ఈ నలంద యూనివర్సిటీలో విద్యను అభ్యసించేందుకు వచ్చేవారన్నారు. దాదాపు 20 దేశాలకు చెందిన విద్యార్థులు.. ఈ నలందలో చదువుకున్నారని గుర్తు చేశారు. ఈ నలంద యూనివర్సిటీ వసుదైక కుటుంబ స్ఫూర్తిని ప్రతీక అని అన్నారు. 2016లో నలంద యూనివర్సిటీని ఐక్యరాజ్య సమితి వారసత్వ ప్రదేశంగా గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్, బిహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్, సీఎం నితీశ్ కుమార్, నలంద యూనివర్సిటీ వైస్ చాన్సలర్ అరవింద్ పనగారియాతోపాటు 17 దేశాలకు

## కేజ్రీవాల్‌కు షాక్.. జూలై 3 వరకు కస్టడీ పొడిగింపు..!



మద్యం పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు జూలై 3 వరకు పొడిగించింది. కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోర్టును కోరింది. తదుపరి విచారణకు సీఎం కస్టడీ ముఖ్యమంతి ఈడీ వాదనలు వినిపించింది. అయితే, వాదనలను కేజ్రీవాల్ తరఫు న్యాయవాది వివేక్ జైన్ కొట్టిపడేశారు. ఈడీ కస్టడీ పొడిగింపు పిటిషన్ 'యోగ్యత లేనిది' అని పేర్కొన్నారు. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను ఈడీ మార్చి 21న అరెస్టు చేసింది. ఆ తర్వాత ఆయన జ్యుడీషియల్ కస్టడీలో తిహార్ జైలులో ఉంటున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. ఆ తర్వాత మరికొద్ది రోజులు మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలని కోరగా.. సుప్రీంకోర్టు నిరాకరించింది. దాంతో ఆయన మళ్లీ జూన్ 2న జైలులో లొంగిపోయిన విషయం తెలిసిందే. మరో వైపు ఇదే కేసులో నిందితుడు వినోద్ చౌహాన్ కస్టడీని జూలై 3 వరకు పొడిగించారు. చౌహాన్‌ను మేలో అరెస్టు చేశారు.

## ఇద్దరు తీవ్రవాదులు మృతి, పోలీస్ అధికారికి గాయాలు



**జమ్ముకాశ్మీర్, జూన్ 18:** జమ్ము కాశ్మీర్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తీవ్రవాదులు హతమయ్యారు. ఒక పోలీస్ అధికారి గాయపడ్డారు. ఈ మేరకు పోలీస్ ఉన్నతాధికారి వెల్లడించారు. బారాముల్లాలో సోపోర్ ప్రాంతంలో తీవ్రవాదులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు తీవ్రవాదులు మరణించారని తెలిపారు. మరోవైపు కేంద్రపాలిత ప్రాంతం బండిపోరాలోని అర్గామ్ ప్రాంతంలో తీవ్రవాదులు ఉన్నారని భద్రత దళాలకు ఆదివారం రాత్రి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో భద్రతాదళాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ విషయాన్ని గమనించిన తీవ్రవాదులు భద్రతా దళాలపై కాల్పులకు తెగబడ్డారు. ఆ క్రమంలో భద్రతాదళాలు జరిపిన కాల్పుల్లో ఒక తీవ్రవాది మరణించాడు.

# ఇక ప్రజల్లోకి గులాబీ బాస్

-మొదటిపేజీ తరువాయి

కేసీఆర్. దీనికి సంబంధించిన కసరత్తును ఆయన ఇప్పటికే మొదలుపెట్టినట్లు ఆ పార్టీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. మరోసారి ఉద్యమ పార్టీ లక్షణాలను పార్టీకి తీసుకొచ్చే దిశగా కేసీఆర్ కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. 14 ఏళ్ల తెలంగాణ ఉద్యమంలో పార్టీ గ్రామస్థాయిలో కూడా బలంగా ఉండేది. ప్రత్యేకంగా గ్రామస్థాయిలో పార్టీకి నాయకులంటూ లేకపోయినా ప్రజలే కార్యకర్తలుగా పని చేశారు. పార్టీ అనుబంధ సంఘాలు కూడా బలంగా పనిచేశాయి. ఉద్యమ సమయంలో ప్రతి రంగానికి ఒక అనుబంధ సంఘాన్ని ఏర్పాటు చేశారు కేసీఆర్. ఆటో యూనియన్ నుంచి సింగరేణి వరకు ప్రతి రంగానికి అనుబంధ సంఘం ఉంది. కానీ 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీతో సహా అనేక అనుబంధ సంఘాలు బలహీనపడ్డాయి. పార్టీకి అనుబంధంగా పనిచేసే టీచర్స్ యూనియన్ కూడా ఉనికి కోల్పోయింది. ఇక తెలంగాణ ఉద్యమ సమయంలో చురుగ్గా పనిచేసిన పార్టీ విద్యార్థి అనుబంధ సంఘం టిఆర్ఎస్వి గత పదేళ్లుగా ఎక్కడా పెద్దగా కార్యక్రమాలు చేపట్టలేదు. యూత్ విభాగానికి అసలు నాయకత్వమే లేకుండా పోయింది.

ఇక పార్టీ విషయానికొస్తే పొలిటికల్ బ్యూరో గత పదేళ్లుగా క్రియాశీలకంగా పనిచేయలేదు. పార్టీకి జిల్లా అధ్యక్షులున్నా పూర్తిస్థాయి జిల్లా కమిటీలు లేవు. ఇక రాష్ట్ర కమిటీలో అన్ని బాధ్యతల్ని భర్తీ చేయలేదు. జిల్లా అధ్యక్షులుగా ఎమ్మెల్యేలు, ఎంపీలను నియమించడం వల్ల అక్కడ కూడా అనేక సమస్యలు తలెత్తాయి. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి ఎదురుదెబ్బ తగలడంతో.. కేసీఆర్ నష్టనివారణ చర్యలకు పూనుకుంటున్నారు. పార్టీని ట్రాక్‌లో పెట్టడంపై ఫుల్ ఫోకస్ చేసిన ఆయన.. ఈ దిశగా పార్టీలో ప్రక్షాళన చేపట్టడంపై దృష్టిసారించారు.గత కొద్ది రోజులుగా ఫామ్ హౌస్‌లోనే ఉన్న గులాబీ బాస్.. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీఆర్ఎస్‌ను బలోపేతం చేసేందుకు పక్కా ప్రణాళికలు రచిస్తున్నారట.



**జిల్లా కమిటీలు, అనుబంధ సంఘాల బలోపేతం..**

బీఆర్ఎస్ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నందున.. ఇక ప్రజా సమస్యలపై పోరాడేందుకు పార్టీని సమాయత్తం చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. ప్రజా పోరాటాలను విజయవంతం చేయడంలో అనుబంధ సంఘాలు, జిల్లా కమిటీలు చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరముందని భావిస్తున్నారు. గతంలో ఎమ్మెల్యేలు మాత్రమే పార్టీ జిల్లా అధ్యక్షులుగా ఉన్నారు. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను పక్కనపెట్టి యువతకు జిల్లా అధ్యక్షులుగా అవకాశాలు ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా కమిటీల నియామకం కోసం ఒక అడహక్ కమిటీ వేయాలని భావిస్తున్నట్లు సమాచారం. అలాగే పొలిట్ బ్యూరో సహా రాష్ట్ర కమిటీని పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని భావిస్తున్నారు. మండలాల వారిగా.. గ్రామాల వారిగా జెండా పండుగ నిర్వహించి కొత్త కమిటీలు పని చేయనున్నాయి.

**ప్రజా క్షేత్రంలోకి కేసీఆర్..**

అటు కేసీఆర్ కూడా ఏదో ఒక కార్యక్రమం పేరుతో ప్రజల్లోకి వెళ్లేందుకు.. రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేపట్టాలని భావిస్తున్నార ని టాక్ వినిపిస్తోంది. జిల్లా కమిటీలు, అనుబంద సంఘాలతో ఎప్పటికప్పుడు సమావేశమవుతూ పార్టీ కార్యక్రమాలకు దిశానిర్దేశం చేయనున్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీకి పూర్వ వైభవం సాధించాలని కేసీఆర్ ఉవ్విళ్లూరుతున్నారు.

# ఎమ్మాహెచ్చార్డీలోనే సీఎం క్యాంప్ ఆఫీసు

**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోసం ప్రభుత్వం కొత్త క్యాంపు కార్యాలయాన్ని సిద్ధం చేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 6 నెలలవుతున్నా, నేటి వరకు ఆయనకంటూ ప్రత్యేకంగా క్యాంపు కార్యాలయం లేదు. ప్రభుత్వ సమీక్షలు వగైరాలను ఇప్పటివరకు ఇంటినుంచి లేదా సచివాలయం నుంచే నిర్వహిస్తూ వచ్చారు. గత ప్రభుత్వ హయంలో సీఎం అధికార నివాసాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ భవనాన్ని ప్రజాభవన్‌గా పేరు మార్చి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారిక నివాసంగా మార్చగా, మరో భాగంలో మంగళ, శుక్రవారాల్లో ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమానికి వాడుతున్నారు. ప్రస్తుతం ఎన్నికల హడావుడి ముగియటంతో సీఎం పాలన మీద ప్రత్యేకంగా దృష్టిపెట్టటంతో బాటు రోజూ సీఎంను కలిసేందుకు వందలాది సందర్శకులు రావటంతో ముఖ్యమంత్రి కోసం పూర్తి స్థాయి క్యాంపు కార్యాలయం అవసరం ఏర్పడింది.దీనికోసం తొలుత నూతన కార్యాలయం నిర్మిస్తే ఎలా ఉంటుందనే కోణంలో అధికారులు అలోచించగా, దానికి ముఖ్యమంత్రి నో చెప్పినట్లు సమాచారం. తన కార్యాలయం కోసం అనవసరంగా ప్రజాధనం వెచ్చించటానికి బదులు.. ఉన్న భవనాల్లోనే ఏదో ఒకదానిని వాడుకుంటే సరిపోతుందని ఆయన సూచించారు. దీంతో అధికారులు పైగా ప్యాలెస్, పోలీస్ టవర్స్ కార్యాలయంతో బాటు పలు ప్రభుత్వ ఆఫీసులను అధికారులు పరిశీలించారు. వాటిలో భద్రత, సౌకర్యాల పరంగా కొత్త నిర్మాణాల అవసరమయ్యేలా ఉండటంతో, అంతిమంగా, జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం(ఎంసీఆర్ హెచ్ఆర్డీసీ) అయితే బాగుంటుందనే అంచనాకు వచ్చారు. సుమారు 45 ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రాంగణంలో ఒకేసారి దాదాపు 150 మంది కూర్చునే సామర్థ్యం కలిగిన నాలుగు హాళ్లు, 375 ఏసీ రూములు, పరిపాలక మండలి సమావేశం నిర్వహణకు వీలుగా బోర్డ్



రూమ్, 250 మంది కూర్చునే ఆడిటోరియం, అతిథులకు ఆశ్రయం ఇవ్వడానికి మంజీర, కృష్ణ, గోదావరి, తుంగభద్ర పేర్లతో వేర్వేరు బ్లాకులు ఉన్నాయి. ఈ ప్రాంగణంలో సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేస్తే రోజువారీ జరిగే కార్యకలాపాలకు భద్రతా పరమైన ఇబ్బందులు కూడా ఉండవనే అంచనాకు వచ్చారు ఎంసీఆర్ హెచ్ఆర్డీసీ ప్రాంగణంలోని గుట్ట మీద ఉన్న బ్లాక్‌లోకి సీఎం క్యాంపు కార్యాలయాన్ని మార్చితే, తక్కువ ఖర్చుతోనే దీనిని క్యాంపు కార్యాలయంగా వాడుకోవచ్చని భావించి, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులను రోడ్లు, భవనాల శాఖ పర్యవేక్షిస్తోంది. ప్రస్తుతం జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి సమీపంలో రేవంత్‌రెడ్డి నివాసం ఉంది. ఇప్పుడు అక్కడి నుంచే సచివాలయం, ప్రజాభవన్‌కు వెళ్తున్నారు. ప్రస్తుతం సీఎం నివాసానికి, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రానికి దూరం కూడా తక్కువ కావటం వల్ల రాకపోకలకు సులభంగా ఉంటుందని, ట్రాఫిక్ ఇబ్బందులూ ఉండవని, అలాగే, నగరం మధ్యలో ముఖ్యమంత్రి కార్యాలయం అందుబాటులోకి తీసుకు రావటం వల్ల సామాన్యులకూ అది వెసులుబాటుగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇక, ఇక్కడున్న మానవ వనరుల అభివృద్ధి సంస్థను ప్రజాభవన్‌లోని మరో భవనంలోకి తరలించనున్నారని తెలుస్తోంది.

# పవర్..వార్.. షురూ...

**హైదరాబాద్ :** తెలంగాణలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలపై విచారణ చేపడుతున్న జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండ రామ్, విద్యుత్ శాఖ అధికారి, నాటి విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నేత కె. రఘు కమిషన్ ముందు హాజరై నాటి పరిస్థితులను కమిషన్ దృష్టికి తెచ్చారు. నాటి ప్రభుత్వ పెద్దల ఒంటెత్తు పోకడలు, అనాలోచిత, తొందరపాటు నిర్ణయాల కారణంగా విద్యుత్ కొనుగోళ్ల మొదలు, నూతన విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం వంటి పలు అంశాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని వారు కమిషన్‌కు వివరించారు. బీఆర్కే భవన్‌లో కమిషన్ కార్యాలయంలో కమిషన్ ముందు హాజరైన వీరు పలు అంశాలపై సమాచారమిచ్చారు.కొత్తగూడెం జిల్లా మణుగూరు వద్ద గోదావరి తీరంలో 1,080 మెగావాట్ల భద్రాద్రి విద్యుత్ ప్లాంటు.. ఏపీలో నిర్మిస్తున్న పోలవరం పూర్తయితే మునిగే ప్రమాదం ఉందని కేంద్రం హెచ్చరించినా వినలేదన్నారు. భవిష్యత్తులో గోదావరికి భారీ వరద వచ్చినా ప్లాంటు మునుగుతుందని ఇంజనీర్లు చెప్పినా, వరద రక్షణ గోడలు కడతామన్నారని చెప్పారు. అనుకున్నట్లుగా 2020 ఆగస్టులో కురిసిన భారీ వర్షాలతో భద్రాద్రి విద్యుత్ కేంద్రంలోపలికీ నీరు చేరిందని ఆయన గుర్తుచేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణ పనులకు టెండర్లు వేయకుండా బీహెచ్ఈఎల్‌కు కాం ట్రాక్ట్ ఇవ్వడం, ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ పవర్, రెనేవబుల్ ఎనర్జీ వైపు వెళుతుంటే గత పాలకులు థర్మల్ పవర్ వైపు దృష్టి సారించటం వంటి అంశాలను కమిషన్ ముందు లేవనెత్తినట్లు తెలుస్తోంది.నాటి కేంద్ర ప్రభుత్వం చెప్పినా వినకుండా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ హడావుడిగా 1000 మెగావాట్ల అదనపు విద్యుత్ కొనుగోలు కోసం ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందాలు చేసుకున్నారనీ, ఈ కొనుగోలుకు ఈఆర్సీ అనుమతి లేకపోయినా, ఉందని అబద్ధాలు చెప్పారని ఆయన కమిషన్ దృష్టికి తెచ్చారు. తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఈ ఒప్పందం రద్దు చేసుకుందనీ, ఆ అనాలోచిత నిర్ణయంతో ప్రభుత్వంపై కోట్లాది రూపాయల అదనపు భారం పడిందని తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారి, జేఏసీ నేత కె. రఘు కమిషన్‌ను కలిసి అనేక అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఛత్తీస్‌ఘడ్‌తో విద్యుత్ కొనుగోలు విషయంలో పాత విధానాలను పక్కనబెట్టిన తీరును కమిషన్‌కు వివరించినట్లు తెలుస్తోంది. వెయ్యి మెగావాట్ల ఒప్పందం జరిగితే ఆ సరఫరాయే సరిగా జరగలేదనీ, అదనంగా మరో వెయ్యి మెగావాట్ల విద్యుత్ కోసం హడావుడిగా ఒప్పందం చేసుకున్నారనీ, తర్వాత తప్పు తెలుసుకుని ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని ప్రయత్నించినా అది సాధ్యపడలేదని, గత ప్రభుత్వ నిర్వాకంతో రూ. 2600 కోట్ల మేర ఖజానా మీద భారంపడిన విషయాన్ని గణాంకాలతో సహా వివరించారు. టెండర్లకు వెళ్లకుండా ఏకపక్షంగా కుదుర్చుకున్న ఈ ఒప్పందాన్ని ఆమోదించొద్దని ఆనాడే తాను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ)కి 10 పేజీల విజ్ఞప్తి లేఖను అందించానని గుర్తుచేశారు. భద్రాద్రి థర్మల్ ప్లాంట్‌లో సబ్ క్రిటికల్ టెక్నాలజీ అనేది రాష్ట్ర ప్రభుత్వం ఛాయిస్ కాదనీ, 2010లో డిజైన్ చేసిన యంత్రాలను, టెక్నాలజీని బీహెచ్ఈఎల్ సంస్థ.. ప్రభుత్వానికి అంటగట్టిందని, ఇవేవీ నేటి అవసరాలకు పనికొచ్చేవి కాదని తెలిపారు. అసలు ప్లాంటు నిర్మించ తలపెట్టిన లొకేషన్ కూడా సరైనది కాదనీ, పర్యావరణ అంశాలను గాలికొదిలేశారని, గోదావరికి వరద వస్తే ప్లాంటు మునగటం ఖాయమని వివరించారు. యాదాద్రి విషయంలోనూ ఇవే తప్పులు జరిగాయని, నిపుణుల మాటను పక్కనబెట్టి బొగ్గు గనులు లేని చోట ప్లాంటు ఆరంభించారనీ, దీనివల్ల రవాణా చార్జీల భారం పెరిగిందని తెలిపారు. 2016లోనే భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్ల విషయంలో ప్రభుత్వ నిర్ణయాలు సరికావంటూ రెగ్యులేటరీ కమిషన్ ముందు మొత్తుకున్నా లాభం లేపోయిందన్నారు. దీనివల్ల వేల కోట్ల నష్టం వాటిల్లిందన్నారు.



## త్యాగం, వారసత్వం, పోరాటం రాహుల్ తత్వం..



**హైదరాబాద్:** ఇవాళ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టినరోజు. ఆయనకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్స్‌లో రాహుల్ గాంధీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అన్ని అసమానతలకు వ్యతిరేకంగా పోరాడటం అతని వ్యక్తిత్వమని పేర్కొన్నారు. వెనుకబడిన వారికి అండగా ఉండాలనేది ఆయన దృక్పథమన్నారు. త్యాగం, వారసత్వం, పోరాటం ఆయన తత్వమని రాహుల్ అన్నారు. ఆయన తెలివైనవాడని.. భవిష్యత్తు కోసం భారతదేశ ఆకాంక్షలను నెరవేర్చే ఏకైక నాయకుడు రాహుల్ అని పేర్కొన్నారు. రాహుల్ గాంధీకి రేవంత్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## నాణ్యమైన డాక్టర్లను అందించడమే లక్ష్యం



-మొదటిపేజీ తరువాయి

కళాశాలల సమస్యలు, మౌలిక వసతుల కల్పనపై వారితో చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని మంత్రి చెప్పారు. మెరుగైన విద్యను విద్యార్థులకు అందించి ఉత్తమ డాక్టర్లుగా వారిని తీర్చిదిద్దాలని కళాశాల యాజమాన్యాలకు సూచించారు. తెలంగాణలో నాణ్యమైన డాక్టర్లను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి రాజనర్సింహ చెప్పారు. హెల్త్ ఎడ్యుకేషన్‌కు తెలంగాణను బెస్ట్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య విద్య కళాశాలలతోపాటు డెంటల్ కాలేజీల్లోనూ మెరుగైన విద్య అందించేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్య విద్య అందించేందుకు ప్రాధాన్యం ఇచ్చిందని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్యానికి సంబంధించి మూడు రకాల టాస్క్‌ఫోర్సులు ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల పర్యవేక్షణ కోసం క్లినికల్ ఎస్టాబ్లిష్?, ఫార్మా మెడికల్లో డ్రగ్స్ నియంత్రణకు, ఫుడ్ క్వాలిటీ కోసం ఇలా మూడు టాస్క్‌ఫోర్సులను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి రాజనర్సింహ వెల్లడించారు.

## మీడియా అక్రిడేషన్ కార్డుల గడువు మూడు నెలలు పొడిగింపు




**హైదరాబాద్ :** రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ (గుర్తింపు కార్డు) గడువును సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా స్థాయి అక్రిడేషన్ కమిటీ చైర్మన్లు, జిల్లా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల కోసం ప్రతి రెండు సంవత్సరాలకోసారి అక్రిడేషన్ కార్డుల సదుపాయం రాష్ట్ర సమాచార శాఖ కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఆ గడువు ఈ నెల జూన్ 30వ తేదీతో ముగుస్తుండగా, గడువు తేదీని సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## అధికారుల బదిలీపై కొలిక్కిరాని కసరత్తు!

-మొదటిపేజీ తరువాయి


సమర్థుడైన అధికారిని నియమించాల్సిన అవసరం ఉంది. దీంతో ప్రభుత్వం తీవ్రంగానే కసరత్తు చేస్తోంది. సమర్థుడైన సీనియర్ అధికారిని నియమించడంపై దృష్టి పెట్టింది. ఇక రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్, అదనపు సీఈవో లోకేష్‌కుమార్, సంయుక్త సీఈవో సర్ఫరాజ్ అహ్మద్‌లను కూడా ప్రభుత్వంలోకి తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. వీరికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలి, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా ఎవరిని ప్రతిపాదించాలన్న అంశంపైనా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే అధికారులకు సంబంధించిన రహస్య నివేదికలు, ఇంటెలిజెన్స్ రిపోర్టులను తెప్పించుకుని పరిశీలిస్తోంది. త్వరలో ఐఏఎస్‌ల బదిలీలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటోంది.

## 15 సెంట్రల్ కరప్షన్ స్టేషన్....

**హైదరాబాద్ :** హైదరాబాద్ పోలీస్ విభాగంలో అత్యంత కీలకమైనది సిసిఎస్ విభాగం. ఇందులో కోట్ల రూపాయల స్కామ్‌కు పాల్పడిన కేసులో దర్యాప్తు జరుగుతోంది. సీసీఎస్ కేంద్రంగా సాగుతున్న దందాలను చూస్తుంటే అవినీతికి అడ్డూ అదుపు లేదనిపిస్తోంది. పోలీస్ శాఖలో వందల కోట్ల స్కాం ఫైల్స్ మిస్ అవుతున్నాయి. అందుకు సీసీఎస్ పోలీస్ స్టేషన్ అడ్డాగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవినీతికి అలవాటు పడ్డ అధికారులు వాటిని మిస్ యూజ్ చేస్తున్నారు. చార్జిషీట్ వేయడంలో అలస్యం చేస్తూ, కోట్ల రూపాయల లంచం తీసుకుంటున్నారు. కేసును వీక్ చేయడానికి ఓ లెక్క, తప్పించడానికి మరో లెక్క, ఇలా అవినీతిని పంచుకుంటున్నారు. ట్విస్ట్ ఏంటంటే, బాధితుల తరుపున కూడా డబ్బులు తీసుకోవడం ఇక్కడి స్పెషల్. అందుకే ఏసీపీ ఉమామహేశ్వర్ రావు విచారణలో ఎన్నో విషయాలు బట్టబయలు అయ్యాయి. అల్వాల్ ఏరియాలో దొరికిన 30 లక్షలు ఓ ఎస్పీ స్థాయి అధికారివి అని తెలిసింది. సందీప్ అనే అధికారికి ఈయనకు మధ్య బినామీ లావాదేవీలు ఉన్నాయి. ఈయన కాప్టీ ఏరియాలో డీసీపీగా చేయడం, కేసులు వస్తే, అక్కడ నుంచి హైదరాబాద్ సీసీఎస్‌కి వెళ్లడం, అక్కడ రాయబారం నడిపించడం లాంటివి ఎన్నో జరిగాయని పోలీసుల విచారణలో తేలింది. కోట్లాది రూపాయలు తీసుకుని సెటిల్మెంట్స్ చేయడమే పనిగా ఇన్నాళ్లూ సీసీఎస్‌ని వాడుకున్న అధికారులు ఉన్నారంటే పోలీస్ వ్యవస్థ ఎంతగా దిగజారిందో అర్థమవుతోంది.ఇటీవల కాలంలో వరుసగా రియల్ ఎస్టేట్ ఫ్రాడ్లు, ఫ్రీ లాంచ్ ఆఫర్ మోసాల పేరుతో జరుగుతున్న వేలకోట్ల రూపాయల స్కాములకు సంబంధించిన దర్యాప్తు సీసీఎస్ అధికారులు చేస్తున్నారు. ఈ క్రమంలో తమకు న్యాయం చేస్తారని వందల మంది బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్న తరుణంలో కొందరు పోలీస్ అధికారులు తప్పుదోవ పడుతున్నారు. ఏకంగా బాధితుల దగ్గరే చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా పోలీసుల చర్య చూసి బాధితులు న్యాయం కోసం వెళ్లి అన్యాయం

# పటాన్చెరులో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు





**జూన్ 19న పుట్టిన పిల్లలకు రూ.10 వేలు అందజేసిన నీలం మధు**

**పాల్గొన్న మంత్రి కొండ సురేఖ**

**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** రాహుల్ గాంధీ ప్రజల మనిషని, బీజేపీ అరాచక పాలనను ఎండగడుతూ అనునిత్యం పోరాటం చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న ఘనత రాహుల్ గాంధీకే దక్కుతుందని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని పటాన్చెరువు పట్టణ అధ్యక్షులు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కోల్కూరి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలకు మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని నీలం మధు వినూత్న కార్యక్ర మానికి శ్రీకారం చుట్టారు. రాహుల్ గాంధీ జన్మదినమైన జూన్ 19న పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం జన్మించిన పిల్లలకు ఒక్కొక్కరికి రూ. పదివేల ను ప్రకటించారు. బుధవారం జన్మించిన ఒక మగ బిడ్డకు మంత్రి సురేఖ చేతుల మీదుగా పదివేల రూపాయల చెక్కును అందజేశారు. రాహుల్ జన్మదిన సందర్భంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం పట్ల నీలం మధును మంత్రి కొండా సురేఖ అభినందించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ భారత దేశ ఉజ్వల భవిష్యత్తుకు రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమన్నారు. దేశంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగి భారత్ ను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో భారత్ జోడో యాత్ర చేపట్టి ప్రజల అందరిని ఏకం చేసి వారి మనసులను గెలుచుకున్న ఘనత రాహుల్ కి దక్కుతుందన్నారు. మొన్న జరిగిన లోక్ సభ ఎన్నికల్లో నైతిక విజయం కాంగ్రెస్ దేనని అభిప్రాయపడ్డారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల మన్ననలు పొందిన రాహుల్ గాంధీ భవిష్యత్తులో భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తాము రాహుల్ గాంధీని ప్రధాని చేయడం ఏ లక్ష్యంగా మెదక్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, శ్రేణులతో కలిసి కాంగ్రెస్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా సైనికుల వలె కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొల్లూరు మల్లేష్, చంద్రారెడ్డి,సదర్ మల్లేష్, యూసుఫ్,గుండ్ల మహేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మండలాధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# వరదల వల్ల నష్టం కలగకుండా చూడాలి

**గ్రామ, మండల స్థాయిలో వరద సహాయక చర్యల కమిటీలు ఏర్పాటు**

**ప్రతి గ్రామంలో మొబైల్**

**ప్రణాళిక బద్ధంగా వరదల బారినుండి ప్రజలను రక్షించాలి**

**వరదలు, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి :** అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వరదల వల్ల నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు.

వర్షాలు, వరదలు సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్పీ కిరణ్ ఖరే తో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వరదల వల్ల నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.

గత సంవత్సరం సాధారణ కంటే ఎక్కువ వర్షాలు కురవడం వల్ల వరదలు వల్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. జిల్లాకు నలు వైపులా వాగులు ఒక వైపు గోదావరి నది ఉందని ఎగువ కురిసిన వర్షాలకు ఉధృతం గా వరదలు సంభవిస్తాయని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండలాలలో గత మూడు సంవత్సరాలుగా వర్ష పాతం నమోదైన ప్రాంతాలను గుర్తించి నివేదికలు తయారు చేయాలని తెలిపారు. మండల స్థాయి అధికారులతో, జిల్లా స్థాయి అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి వరదలు సంభవించినప్పుడు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టే విధంగా సిద్ధంగా ఉండాలాన్నారు. గ్రామ స్థాయిలో పంచాయితీ సెక్రటరీ లు అందుబాటులో ఉండాలని గ్రామ స్థాయిలో మొబైల్ టీమ్ ను ఏర్పాటు చేయాలని, గ్రామ స్థాయిలో పంచాయితీ సెక్రటరీలు, ప్రజా ప్రతినిధులు, మహిళా సమాక్య సభ్యులు, రేషన్ డీలర్లను, యువతను సమన్వయ పరుస్తూ ప్రణాళిక బద్ధంగా గ్రామాలలో వరద ఉధృతి కి కారణమయ్యే ప్రాంతాలు, గుర్తించాలని సూచించారు. చెరువుల పటిష్టతపై 15 రోజుల్లోగా నివేదిక అందించాలని అన్నారు. గ్రామాలలో ఉన్న చెరువులు, కుంటల మత్తడీల వద్ద అడ్డంకులు లేకుండా చూడాలని వరదలు వస్తే నీరు వెళ్ళడానికి అడ్డుపడి చెరువులు తెగిపోయే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ప్రభావం ఉంటుందని తెలిపారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రహదారులపైకి నీరు చేరిన మార్గాలలోను, పొంగుతున్న వాగులు దాటకుండా పటిష్ఠ నియంత్రణకు పోలీస్ సహాయంతో బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. రహదారిపై రవాణా నియంత్రణకు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో పునరావాస కేంద్రాలకు ఏర్పాట్లు చేయాలని, పునరావాస కేంద్రాలలో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని వరదలు సంభవించినప్పుడు ట్రాక్టర్లు, జేసిబిల సేవలను వినియోగించాలని తెలిపారు. వరదల సమయంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని గర్భిణీ స్త్రీలు, ఆత్యవసవర చికిత్స పొందుతున్న రోగులను గుర్తించి ముందస్తుగా ఆసుపత్రులకు తరలించాలన్నారు. గోదావరి పరివాహక గ్రామాలలో గోదావరి పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టాలని ప్రజలను అప్రమత్తం చేయాల ని తెలిపారు. హాస్టళ్లు, గురుకుల పాఠశాలల విద్యార్థులకు వర్షాకాలంలో మందులు, ఆహారం, మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో వానాకా లంలో వచ్చే సీజనల్ వ్యాధుల చికిత్సకు అవసరమయ్యే మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పంచాయితీ సెక్రటరీ లు గ్రామాలలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను, వంగిన విద్యుత్ పోల్స్, అలాగే పడిపోయే దశలో ఉన్న చెట్లు గుర్తించి తొలగించాలని అన్నారు. వరదల ముంపుకు గురైన ప్రాంతాలలో అత్యవసర వైద్య సేవలు అందించాలని, నిరంతరాయంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి బ్లీచింగ్ చేయాలని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు చెరువు కట్టలను పరిశీలించి వరదల సమయంలో తెగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. వరదలు సమయంలో పశువుల కాపరులు, రైతులు చెరువులు కాలువలు దాటి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండాలని అన్నారు. అత్యవసర పరిస్థితులలో 24 గంటలు పని చేయు విధంగా జిల్లా స్థాయిలో కంట్రోల్ రూము ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ, మండల, జిల్లా అధికారులు అత్యవసర సేవలకు గాను.కార్యస్థానాల్లో అందు బాటులో ఉండాలని ఆదేశించారు. దోమలు వ్యాప్తి చెందకుం డా ప్రతి గ్రామ పంచాయతీలో ఫాగింగ్ మిషన్లు ఉండాలని ప్రతి రోజు గ్రామ పంచాయితీల్లో ఫాగింగ్ చేయించాలని అన్నారు. నీరు కలుషితం కాకుండా చూడాలని, మంచి నీటి పైపులను పరిశీలించి మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలోని ప్రధాన కూడళ్లలో, గ్రామ పంచాయితీలలో వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహనకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి చెరువు దగ్గర సైన్ బోర్డు ఏర్పాటు చేయాలని చెరువుల స్టోరేజ్ వివరాలను ఎప్పటికప్పుడు పై అధికారులకు తెలియపరచాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. త్రాగునీరు కలుషితం కాకుండా పంచాయితీ రాజ్, ఆర్డబ్లూఎస్ శాఖలు సమన్వ యంతో పని చేసి నీరు కలుషితం కాకుండా ఫ్లోరో స్కోప్ ద్వారా మంచి నీటి పరీక్షలు నిర్వహించాలని అన్నారు. గత సంవత్సరం వర్షాల వల్ల పంచాయితి రాజ్ , ఆర్ అండ్ బి శాఖల పరిధిలో దెబ్బతిన్న రోడ్లను మరమత్తులను చేయిం చడం జరిగిందని, మండలాల వారీగా లో లెవల్ వంతెనల వివరాలు ప్రమాద కర రోడ్ల వివరాల నివేదిక అందించాలని అక్కడ సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పశు సంవర్ధక శాక ద్వారా వానాకాలంలో పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు త్వరలోనే ఒక పాలసీ

**హైదారాబాద్ జర్నలిస్టు సొసైటీ సభ్యులకు ఇళ్ల స్థలాలు**

**జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు మూడు నెలలు పొడిగింపు**

**రాష్ట్ర సమాచార పౌర సంబంధాల రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**ఖమ్మం లో టీయూడబ్ల్యుజే (ఐజేయూ) రాష్ట్ర తృతీయాహసభలు**

రాష్ట్రంలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు త్వరలోనే కొత్త పాలసీ ని తీసుకు వస్తామని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. బుధవారం ఖమ్మంలో జరుగుతున్న టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర తృతీయ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల కీలక పాత్రను పోషించారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పడికట్టు పదాలతో సమస్యలు తీరుస్తామంటూ హామీలు ఇచ్చారే గాని ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజా పాలన రావడానికి జర్నలిస్టులు కృషి చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదులో గతంలో జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాలకు సంబంధించి కోర్టులో కేసు వల్ల ఆగిపోయాయని, ఏడాది క్రితమే ఆ కేసు క్లియర్ అయినా కూడా గత ప్రభుత్వం ఇప్పటివరకు వారికి ఇళ్లస్థలాలను ఇవ్వలేదని విమర్శించారు. త్వరలోనే ఆ స్థలాలను హైదరాబాద్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ సభ్యులకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వారం, పది రోజుల్లోనే దానికి సంబంధించిన జీవో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. అలాగే హైదరాబాద్లో మిగిలిపోయిన మిగతా జర్నలిస్టులకు, జిల్లాలు, మండలాల్లో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు త్వరలోనే ఒక పాలసీని తీసుక వస్తున్నామని చెప్పారు. గతంలో ఖమ్మంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలకు సంబంధించి ఇచ్చిన జీవో ఆగిపోయిందని తెలిపారు. మరొక స్థలాన్ని చూడాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించామని ఆ ప్రక్రియ వారం రోజుల్లో పూర్తవుతుందని ప్రకటించారు. అక్రిడిటేషన్ల గడువు ఈ నెలాఖరు తో ముగుస్తున్నదని, మరో మూడు మాసాల పాటు గడువు పెంచుతున్నామని దీనికి సంబంధించిన ఉత్తర్వులు ఒకటి వెలువడనున్నాయని మంత్రి పేర్కొన్నారు. వందకు వంద శాతం జర్నలిస్టులకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని, హెల్త్ కార్డులకు సంబంధించి, వివిధ రాష్ట్రాల్లో ఉన్న పాలసీలను అధ్యయనం చేసి దానికి అనుగుణంగా జర్నలిస్టులకు వైద్యాన్ని అందిస్తామని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, రక్షణ కోసం ఉన్నటువంటి అన్ని రకాల కమిటీలను త్వరలోనే పునరుద్ధ రిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి, ఐజేయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్, టియుడబ్ల్యూజే (ఐజెయు) రాష్ట్ర అధ్యక్షులు నగునూరి శేఖర్, ప్రధాన కార్యదర్శి విరహత్ అలీ, ఐజేయూ ప్రతినిధులు నరేందర్ రెడ్డి, కే సత్యనారాయణ, జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

## భీంపూర్లో సికెల్ సెల్ పై అవగాహన



**వాస్తవ నేస్తం,భీంపూర్:** అవగాహన పెంపొందించడం వలన సికెల్ సెల్ వ్యాధి సంక్రమించకుండ కాపాడవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ రాజ్ అన్నారు. ప్రపంచ సికెల్ సెల్ దినోత్సవంను పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంతో పాటు అందర్ బంద్, కరంజి(టీ), గిగ్గవ్, గోన తదితర గ్రామాలలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు సికెల్ సెల్ అనీమియా పరీక్షలు నిర్వహించారు. అనంతరం సికెల్ సెల్ వ్యాధి పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్న ప్రభ సంతోష్, ఆరోగ్య విస్తరణాధికారి లింగం పల్లి జ్ఞానేశ్వర్, వైద్య సిబ్బంది గంగాధర్, సంతోష్, విష్ణు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మానాల మోహన్ రెడ్డి



**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండలములోని నాగేంద్ర నగర్ గ్రామంలోని రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ జలీల్ ఇటివలే అనారోగ్యంతో మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. అలాగే తాళ్ళరాంపూర్ గ్రామంలో ఇటీవలే తాటి చెట్టు పై నుండి కింద పడి మరణించిన బోధస్ గంగాధర్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదే గ్రామానికి చెందిన చిట్యాల సాయమ్మ అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవా రెడ్డి, జడ్పిటిసి గుల్లే రాజేశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గంగా ప్రసాద్, గుమ్మిర్యాల్ మాజీ ఎంపిటిసి గడ్డం లింగారెడ్డి, డిసిసి డెలిగేట్ జీవన్ రెడ్డి, మైనారిటీ అధ్యక్షుడు మునిరుద్దీన్, సంసాన్, కాటిపెల్లి రఘుపతి, సంజీవ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ దినోత్సవ అవగాహన ర్యాలీ



**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాల విద్యార్థులతో బుధవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. 1 నుండి 19 సంవత్సరాల వయసు కలిగిన బడి ఈడు పిల్లలు, యుక్తవయస్కులు తప్పనిసరిగా నులిపురుగు నివారణ మాత్రలను వేసుకోవాలని ఏర్గట్ల పీహెచ్సీ రిపోర్టింగ్ అధికారి మారుతి గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమం ఏడాదికి రెండుసార్లు అమలవుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు పండరి, ఏఎన్ఎంలు వీణ, సుమ, సుకన్య, కల్పన, రాజహంస, ఆశాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మంగంపేట గ్రామంలో పర్యటించిన ఆర్డీవో



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** మంగంపేట గ్రామంలో గత కొన్ని రోజులుగా ఆజాద్ కంపెనీ వారు డంప్ యార్డును, పల్లెప్రకృతి వనాన్ని మరియు మంగంపేట గ్రామం నుండి ఊట్ల వరకు లింకు రోడ్డు ను కూడా ఆక్రమించుకోవడంతో మంగంపేట గ్రామంలోని 55 సర్వే నెంబర్ లో గల అతి పురాతనమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని ధ్వంసం చేశారు. ఇట్టి విషయంపై గతంలో జిల్లా కలెక్టర్ గారికి ఫిర్యాదు చేశారు. ఇట్టి విషయంపై విచారణకు జిల్లా ఆర్డీవో విచారణ చేపట్టారు. విచారణ జరిపి గ్రామ ప్రజలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com